# కొత్త అమ్మ

ప్రియంవద మేడమీద గదిలో గాఢంగా నిద్రపోతోంది. వెన్నెల కాంతులు కొబ్బరిమట్టల్ని తోసుకొని కిటికీ చువ్వల సందుల్లోంచి, ఆమె లేతచెక్కిళ్లమీద నాట్యం చేస్తున్నాయి. సుందరం, మీద చెయ్యి వేసుకొని పడుకున్నాడు. గోడ గడియారం ఖంగున ఒకటి కొట్టింది. ఉలిక్కిపడి లేచాడు. ప్రియంవద మొహంలోకి అదే పనిగా చూశాడు రెండు క్షణాలపాటు. ముంగురులు నిమురుతూ, బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. సుందరం కళ్లు చెమ్మగిల్లినా ఒళ్లు జల్లుమన్నది. గోడ మీద ఫోటోవంక బింకంగా చూశాడు. గత చరిత్రంతా నెమరుకు వచ్చింది.

శాయి ప్రక్కలో అటూ ఇటూ మెసులుతున్నాడు. వనజ దొర్లి దొర్లి, శాయి కాళ్ల క్రిందకు వచ్చింది. ఇద్దర్నీ సర్ది పడుకోబెట్టి, తాను మెల్లిగా లేచాడు. దుప్పటి కప్పేసి గబగబా మెట్లుదిగి క్రింద గదిలోకి వెళ్లి పడుకున్నాడు.

తెలతెలవారుతూండగానే శాయిలేచి ఏడవటం మొదలు పెట్టాడు. వనజ 'అమ్మా! అమ్మా! అనటం మొదలు పెట్టింది. ప్రియంవదలేస్తూ కళ్లు తుడుచుకుంటూ నాన్నా అన్నది. ప్రక్కలో సుందరం లేడు. అటూ ఇటూ చూసింది. చప్పున క్రిందకు వెళ్లింది.

గౌరీ మానాన్న ఇక్కడకు వచ్చాడా అన్నది.

'రాలేదమ్మా!....' గౌరి పొంగివస్తున్నపాలను దింపుతూ చెయ్యి చుర్రుమనిపించుకుంది.

'పిల్లిరాకుండా చూడమ్మా. గ్లాసులు తీసుకుని వస్తాను' అంటూ గౌరి పక్కి గదిలోకి వెళ్లింది బిత్తరు చూపులు చూసుకుంటూ.

సుందరం ఇంకా నిద్రపోతునే వున్నాడు.

'ఏమండీ! ఏమండీ! మిమ్మల్నే! పలకరే! ఒక మూల చప్పగా తెల్లారిపోతే?' గౌరి గాభరాగా పిలుస్తోంది.

'మాలతీ!....అంటూ చివాలున లేచాడు.

'నేను మాలతమ్మగార్ని కాదండీ నేనుగౌరిని కళ్లు తుడుచుకు చూడండి....' గౌరి, సుందరం కళ్ళ ఎదుటకువచ్చి నిలబడింది.

'గౌరీ! సరిగ్గా నువ్వు పిలిచినట్లే పిలిచేది మాలతికూడా. కాఫీ ఎప్పుడు చేశేదో ఏమో నా మొహాన దుప్పటి లాగేసి కాఫీ యిచ్చేది. అబ్బ! సూర్యోదయం అయినతర్వాత నిద్రపోకూడదని ఎన్నిసార్లు చెప్పాను అంటూ కొంచెం గదమాయించేదికూడా. ఏమో, ఇవ్వాళ రాత్రంతా, మాలతే నాదగ్గరకువచ్చి కూర్చున్నట్లనిపించింది. జాలిగా నామొహంవంక చూసింది. నన్ను ప్రాధేయ పడింది. నామీద ఒట్టింది. నాకేమీ అర్థం కాలేదు. ఉలిక్కిపడి లేచాను. నా గది ఎంత బరువుగా వుంది!.... పెద్దగా నిట్టూర్పు, విడుస్తూ లేచాడు. సుందరం.

'నాన్నా' అనిగట్టిగా శాయి లోపల్నించి పిలిచాడు. సుందరం త్రుళ్లిపడ్డాడు.

'పిల్లలు నిద్ర లేచారా' అంటూ గబగబ దొడ్లోకి వెళ్లి మొహం కడుక్కొని లోపలికి వచ్చాడు.

'ఏమిటి నాన్నా పొద్దున్నే లేచి వెళ్లిపోయినావు ఎక్కడికి వెళ్లావేమిటి? చెప్పునాన్నా....' ప్రియంవద సుందరాన్ని చుట్టేసింది.

'ఏమిటే మరీను, వనజకంటె చిన్నదానవై పోతున్నావు' అంటూ మాట తప్పించాడు.

ఒకకప్పుడు కాఫీని సుందరానికి యిచ్చింది.' 'అబ్బాయి ఆ డబ్బా యిటు పెట్టు!....' అన్నది.

'నువ్వే తెచ్చుకో! నీకు అవీ ఇవీ అందిస్తూ వుంటాను!.... శాయి గ్లాసును గిరాటు పెట్టాడు.

సుందరం శాయివైపుకి కోరచూపు చూశాడు.

'ఒరేయ్ అమ్మకు పూలదండ వెయ్యాలి రారా' అంటూ ప్రియంవద, శాయి చెయ్యిపట్టుకుంది, వెంట వనజ లేచింది.

సన్నజాజి పూలదండ తెచ్చారు. 'అమ్మకు నేను దండవేస్తానంటే నేను వేస్తాను' అంటూ, పంతం పడుతున్నారు.

'అక్కయ్యా! మనం పూలదండవేస్తే అమ్మకు తెలుస్తుందా?' వనజ అక్కయ్య వైపుకు చూసింది.

'అదుగో అమ్మ మన వంకే చూస్తోంది....' అన్నది.

ఇంతలోకి సుందరంవచ్చి, ఫోటోముందు నిశ్చలంగా నిలబడ్డాడు. వనజ చేతిలో దండతీసుకుని తానే స్వయంగా మాలతి ఫోటోమీద

వేశాడు. చేతులు వణకినాయి. ఒళ్ళు జలదరించింది. తన పెళ్లినాటి సంఘటన చప్పున కళ్లకు కట్టినట్లయింది. మాలతికూడా మళ్లీ దండ వేస్తోందా అన్నట్లు సుందరానికి అనిపించింది.

అన్నాలముందు ఒకటే జాతర. నలుగురూ ఒకేసారి కూర్చుంటారు. గౌరి వడ్డిస్తోంది.

'అదికావాలి ఇదికావాలి' అంటూ వేధించుకు తింటున్నారు. గౌరి సతమతమై పోతోంది.

'అన్నం నాకు ముందర పెట్టాలంటే, నాకు ముందర పెట్టాలని' ప్రియంవద, శాయి, పంతం పట్టారు. గౌరికి ఎటూ తోచటంలేదు. ఇంతలోకి వనజకూడా మెల్లిగా అన్నది, నాకు అన్నం ముందర పెట్టు. గౌరి చప్పున వనజ విస్తట్లో అన్నం పెట్టింది.

'పాడుముండ!....' అంటూ తన విస్తరిని చిమ్మేశాడు శాయి. సుందరానికి చర్రుమని కోపం వచ్చింది.

శాయి చెంప ఛెళ్లుమనిపించాడు. బుగ్గ ఎర్రగా కందిపోయింది. పెద్ద పెట్టున ఏడుస్తూ గదిలోకి వెళ్లిపోయాడు.

క్షణంలో సుందరానికి స్పృహ వచ్చినట్లనిపించింది. తన చెయ్యి చూసుకున్నాడు. ఎర్రగా కందిపోయింది. అబ్బ అనుకున్నాడు. తనకళ్లలో నీళ్లు గిర్రున తిరిగినాయి.

ఎప్పుడైనా పిల్లల్ని గదమాయించినా, కొట్టినా మాలతి వద్దంటూ వారిస్తూండేది. ఈ సారి మీరు పిల్లల్ని కొట్టారంటే నామీద ఒట్టె అనేది మాలతి. తాను ఎప్పుడూ పిల్లల్ని ఏమన్నా చప్పున అమ్మదగ్గరకు

వెళ్లి నాన్న కొట్టాడే అనేవాళ్లు, ఇపుడు తానుకొడితే తానే బుజ్జగించి తీసుకరావాలి.

సుందరం ఒక్క అంగలో శాయి దగ్గరకు వెళ్లాడు. అబ్బాయి కళ్లు ఎర్రబడ్డాయి. మొహం ఉబ్బింది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. దగ్గరకు తీసుకుని బ్రతిమాలుకున్నాడు.

'శాయి! ఎప్పుడూ నిన్ను కొట్టను. నామాట విను....ఎత్తుకొని తీసుకువచ్చి అన్నం తినిపించాడు.

అనాడల్లా, శాయి మనస్సు పరిపరివిధాలా, పోయింది. తీవ్రంగా మథనపడ్డాడు. గౌరితోనూ మాట్లాడలేదు.

గౌరి ఒకవైపు. పిల్లలు ఒకవైపు. విరుద్ధంగ కనిపిస్తున్నారు. రకరకాల ఆలోచనలు వస్తున్నాయి.

మాలతి పోయినప్పటినుంచి, గౌరే నన్ను కనిపెడుతూ వస్తోంది. నామనస్సు తెలుసుకొని ప్రవర్తిస్తోంది. నాకు ఎంతో మనశ్శాంతి 'ఇస్తోందనుకున్నాడు సుందరం.

ఇంట్లో పిల్లలకి, గౌరికి క్షణం పడటంలేదని వాళ్లిష్టంవచ్చినట్లు గౌరిని అంటున్నారు. గౌరి ఎంతో మానసిక బాధ పడుతూవుంటుంది. ఏ బాధపడ్డా కూడా, నామీద ప్రేమచేత, ఇక్కడే ఉండిపోతోంది. ఎంతో సహనంగా ఉంటోంది. సతమతమయి పోతున్నాడు.

కాఫీ సుందరానికి అందిచ్చి నిలబడిపోయింది గౌరి. [illegible] గుటకలు వేస్తూ 'గౌరీ' అనిపిలిచాడు.

తలెత్తి చూసింది.

'గౌరీ నీతో ఒకమాట....' చప్పున ఆపేశాడు ఆశ్చర్యంగా ఆమె మొహంలోకి చూశాడు.

పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకొని మొహనికి చేతులు అడ్డం పెట్టుకున్నాడు. ఎంతో స్వతంత్రంగా ముందుకువచ్చి అడ్డం పెట్టు కున్నచేతుల్ని గట్టిగా పట్టుకుంది గౌరి.

'ఏమండి' అన్నది. ఇంకా దగ్గరగా వచ్చింది.... ప్రక్కన కూర్చుంది. మొహంలో మొహం పెట్టి 'ఏమండీ' అన్నది మళ్ళీ.

ఇంతలోనే వనజ 'నాన్నా నాన్నా' అంటూ రానేవచ్చింది. చివా లున గౌరిలేచి నిలబడింది.

వనజ కళ్లార్పుకుంటూ అట్లాగే నిలబడి పోయింది.

సుందరం కూతుర్ని పిలవలేకపోయాడు. రెండు క్షణాల్లో వనజ గిరుక్కున తిరిగి వెళ్లిపోయింది.

'అక్కయ్యా, మరే, గౌరి, నాన్న మంచం మీదకూర్చుని....' వనజను పూర్తిగా చెప్పనీయ కుండానే 'ఆ' అన్నది ప్రియంవద.

'అప్పను అక్కయ్యా ఒకసారి నేనుకూడా చూశా. నాన్న దగ్గ రగా కూర్చుని మాట్లాడుతుంది గౌరి మంచిది కాదు. పాడుముండ. ఒకసారి నాన్న చెయ్యి పట్టుకుని గట్టిగా లాగింది. నన్ను చూసి చప్పున వెనక్కు వెళ్లింది' శాయి ఆవేశంగా అన్నాడు.

ప్రియంవద తనుకూడా ఒకసారి చూసిన సంఘటన జ్ఞాపకం తెచ్చుకుని మెదలకుండా పూరుకుంది.

'మరే నాన్నేమొ, గౌరి ఏమిచెబితే అది వింటాడు. మనమట దాన్ని ఏమీ అనకూడదుట. దానిమాట వినాలట. నన్ను కొట్టాడు కూడా....' శాయి చెంప చూసుకున్నాడు.

ప్రియంవద మవునంగా వుండిపోయింది. తెలిసీ తెలియని వయస్సులో రకరకాల ఆలోచన్లువచ్చి కలవర పెట్టేసినాయి. పెద్దపెట్టున ఉక్రోషం వచ్చింది. వంటమనిషి మనమీద పెత్తనం చెలాయించటం ఏమిటి? అని గట్టిగా అనుకుంది. తమ్ముడిని, చెల్లెల్ని వోదార్చింది. తండ్రిని చూసికూడా ఏమీ మాట్లాడలేదు. ఇంకా బింకంగానే వుంది.

'ఏయ్! నిన్నే వినిపించటంలా!' గట్టిగా అరిచింది ప్రియంవద గౌరినిచూసి.

'ఏమిటా పిలుపు....' సుందరం కస్సుమన్నాడు.

'మరి ఎట్లా పిలవాలేమిటి!' రివ్వునలేచాడు శాయి.

ఇద్దరివంక కోరచూపు చూశాడు. మళ్ళీ తమాయించుకున్నాడు.

రోజురోజుకు, గౌరికి, పిల్లలకు ఘర్షణ పెరిగి పోతోంది.

ఒకనాడు పిల్లల్ని పెట్టుకుని సుందరం ఆ మాటా ఈ మాటా చెపుతున్నాడు.

మాటలసందులో 'గౌరి మంచిదికాదు నాన్నా' అన్న ప్రియంవద.

'ఏంచేసిందే నిన్ను!....'

'అన్నింటికి తనమాటే సాగాలంటుంది. ఇంటిపెత్తనం అంతా తనదిలాగా మాట్లాడుతుంది. మేము ఏదన్నా ఒప్పుకోదు. అది చెబితే

నువ్వు సరేనంటావు. వంటచేసి వూరుకోక అన్ని విషయాల్లో తన కెందుకో జోక్యం....' ఆరిందాలాగా అన్నది. ప్రియంవద.

సుందరం ఏమీ మాట్లాడలేకపోయాడు.

రానురాను గౌరితో ఇంట్లో పిల్లలు మాట్లాడ్డంలేదు. గౌరి పిలిచినా పలకటంలేదు. సుందరానికి విపరీతంగా బాధగావుంది. లోపల లోపల చాల ఘర్షణ పడిపోతున్నాడు.

రోజులు మెల్లిమెల్లిగా గడచిపోతున్నాయి ఒకనాడు ప్రక్కింటి వాళ్లింటికి పేరంటానికి వెళ్లింది పి్రియంవద. తిరిగివస్తుంటే స్నేహి తురాలు ఎంతోసంతోషంగా 'ప్రియా ఇంక మీయింటి శని వదిలి పోతుందిలే' అన్నది.

'ఎవరు శని?' అన్నది ఆశ్చర్యంగా ప్రియంవద

'ఇంకెవరు! గౌరే! గౌరివెళ్లిపోతుంది....నీకు తెలీదా!....'

ప్రియంవద మాట్లాడలేక పోయింది.

'మీనాన్న పెళ్లిచేసుకో బోతున్నాడు.... ఇంకా గౌరి మీయింట్లో ఎందుకుంటుంది! అన్నది.

ప్రియంవదకు వెన్నుమీద కొట్టినట్లయింది. గబగబ యింటికి వచ్చేసింది.

'నాన్న పెళ్లిచేసుకుంటాడు. ఏదో ఏదో గుణించుకుంటోంది. కాళ్ళు చేతులు ఒణికి పోతున్నాయి. శాయితో చెప్పింది. వసంతకు చెప్పింది. ముగ్గురు కలసి గుణించు కుంటున్నారు. నాన్న పెళ్లిచేసు

కుంటాడు అంటూ ముగ్గురు మూడు రకాలుగా ఆలోచించు కుంటున్నారు.

తల్లి ఫోటోదగ్గరకు వెళ్లి చేతులు జోడించి కళ్ల నీళ్లు పెట్టు కున్నారు. 'అమ్మా' అంటూ బావురుమన్నారు.

'నువ్వే మా అమ్మవి. మాకు కొత్తఅమ్మ వద్దు' అన్నది ప్రియంవద ఏడుస్తూ.

'మాకు ఇంకో అమ్మ వద్దు....' శాయి గొంతుకలోంచి మాట పెగిలిరాలేదు.

వనజ పెదిమలు తడబడుతున్నాయి 'అమ్మా! అమ్మా' అని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అక్కయ్యా మళ్ళీ అమ్మ వస్తుందా అన్నది కన్నీళ్లు తుడుచు కుంటూ వనజ.

ముగ్గురు బిక్క మొహాలతో తండ్రి దగ్గరకు వెళ్లారు. సుందరం, పిల్లల్ని చూసి పూర్తిగా కృంగిపోయాడు. దగ్గరకు తీసుకున్నాడు. వీళ్లకు ఎవరో చెప్పివుంటారు అనుకున్నాడు.

'నాన్నా' అన్నది వనజ గద్గదంగా.

శాయి కళ్లు తుడుచుకుంటూ తండ్రివంక చూశాడు.

ప్రియంవద తలవంచుకునే మెదలకుండా కూర్చుంది.

కొద్ది క్షణాలవరకూ ఎవరూ మాట్లాడలేదు. "నాన్నా! .... నువ్వు పెళ్లిచేసుకుంటున్నావా!...." అని ఆగి అన్నది. ప్రియంవద ఎంతో భయంతో.

'అమ్మా!....' కొతుర్ని గట్టిగా కౌగలించుకున్నాడు.

మాలతికి తాను యిచ్చిన ప్రమాణం జ్ఞాపకంవచ్చి, సుందరం నిర్విణ్ణుడయి పోయాడు. ఒక్కక్షణం హృదయచలనం ఆగిపోయి నట్లనిపించింది. గుండె నిబ్బరం చేసుకున్నాడు.

'గౌరి....మంచిది....కాదు....వెళ్లిపొమ్మన్నా! 'మరిమీకు అన్నం వండిపెట్టేదెవరు?....అందుకని ఇంకా ముందుకు సాగలేకపోయాడు.

'కొత్తమ్మ వద్దునాన్నా ...' శాయి కళ్లు పెద్దవిచేసి ఎంతో గంభీరంగా అన్నాడు.

'మరి ఇంకో అమ్మవద్దు....'

'మా అమ్మే మంచిది....'

'మరి మీకు అన్నం వండిపెట్టద్దు....' ఎంతో బిగువుగా సుందరం పెదిమల సందులోంచి మాటలు దొర్లినాయి.

సుందరం కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. శాయివైపుకు తిరిగాడు. శాయి 'అవును' అన్నట్లు తలవూపాడు. వనజవైపుకు తిరిగాడు.

'ఇంకో అమ్మవద్దు....గౌరే మాకు అన్నం వండిపెడుతుంది అన్నది వనజ.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21—10—1959)